# ప్రథమ వియోగం

సంపత్ కుమార్

దేవీ !

అందాల చంద్రికలు అల్లలాడే నీ మోమును.. చిలిపి నవ్వుల్ని చిందిస్తూన్న పెదవుల్ని ... పయిటలోనుండి మిసిమిసినవ్వుల్తో దొంగచూపులు చూస్తూన్న ఆచన్గవల— మాని— తన్మయత్వంలో నీ ఫొటో అందుకుని హృదయానికత్తుకున్నాను; ముద్దుల్ని కురిపించాను. ఏంటో మాట్లాడతాను. కాని నీవు మాట్లాడవు— ఏంటో అర్థంలేని నవ్వుల్ని విసిరేస్తావు...... కోపం వచ్చి కుర్చీలో వాలాను. మనోధైర్యం జాలక మళ్ళా చూశాను ... ఆనవ్య నాగరికతాశోభతో ప్రకాశిస్తూన్న నీ బింబాన్ని చూసి ... మన స్నానాలు ... ఆటపాటలు ... అవీ జ్ఞప్తికివచ్చి ... సిగ్గవుతుంది. ఆ కమ్మనిరోజుల్ని యెట్లా మరచిపోగలను? ... ఆనాడు బలంగా రెక్కలట్టుకొని వూపిరాడకుండా ... పేరంటాండ్రు ... తోసి తలుపేసినప్పుడు నాపైపడి నీవు రెండల్లోకి తల దూర్చుకొన్నప్పుడు ... అబ్బ! నాహృదయం గిజగిజలాడిపోయింది. నీవా? ... ఆగుండ్రని దండల్లోంచి ... చిరునవ్వులు చిలికే చిన్న పెదవులు బిగబట్టి నవ్వుతూ మెరిసే నయనాల్తో కౌతుకంగా చూస్తూంటే ... ఆ తన్మయత్వం ... నీలోని దేనిపొందికకోరకో వెతుక్కొని ... అప్పుడూ ... నా వొళ్ళు ఝల్లుమంటూంది. నన్నట్లా ప్రణయగీతాల్లో వూగించి, నవ్వుల్లో యెగిరించి ... యిప్పుడు నా కందకుండా దూరాన్న నిశ్చలంగా వున్నావు కాబోలు!

శేషన్ భోజనం ఏదో చేసిపోతాడు ... వెన్నెల కన్నెలలతో సైనా ఆడుకుందామని. వెన్నెలలు ప్రణయవసంతాన్ని నాపైజల్లి నాకేదో ఆవేశాన్ని కలిగిస్తాది. అదిచూసి కొంటెనక్షత్ర పిల్లకాయలు ఏవో సైగలు చేసుకుంటాయి. ఈ బాధకి మాలతీ నీడలో పడుకుంటే మాలతీరాణులు మాతలు ముడుచుకుంటాయి ... నిద్రపోతే? ... నీ ప్రియుడు నన్నొదలి నీవద్దకు పరుగెత్తి, నిన్ను కౌగిలిజేర్చుకుంటాడు ... ప్రణయకిరణా లుద్భవించే నీ నయనాల్ని చూసి ... ఏదో వుద్రేకం పొంగి ... తెల్లనిచీర కుచ్చిళ్ళను పట్టుకొని లాగేసి ... ఆ వక్షస్థలంలోని ... ఆ తొడల్లోని ... అందచందాల్ని, నునుపుల్ని, వంపుల్ని ... చూసి ... ఉన్మత్తతకలిగి తన శరీరాన్నంతట్నీ నీ రెండు తొడల్లోకిదూర్చి ... మెత్తని శరీరముమీద పడుకొని ... యెన్నిగంటలో, యెప్పటికి సమాప్తమవుతుందో తెలియకుండానే నిద్రపోయి పోయి— చెట్లమీద పక్షుల కోలాహలానికి మెలకువొచ్చి, మెల్లగా జేరుకుంటాడు, తన పంజెరాన్ని! లేచి కూచుంటే ... చామంతీ గులాబీలు కులుకుతూ, 'మా కుసుమ యెప్పుడువస్తుంది?' అన్నట్లు నావైపుచూస్తావి. నా జబాబు? ... మౌనంగా తలొంచుకు లోనికిపోతాను.

ఉదయాన్నే లేచి, పైటచెంగు చివరమెలిపెట్టి, చెవుల్లో కితకితలుపెట్టిలేపి ... నయనాల్ని సగం ముడిచి ముద్దులెట్టుకొని ... ఒయ్యారంగా పరుగెత్తి గడియతీస్తూ ప్రణయనవ్వుల్నివీచి యిట్టే మాయమయ్యేదానివి! నాలో యేవో ఆనందతరంగాలు లేచి ఆడగా ... అన్నీ సవరించుకొని బైటపడితే స్నేహితుల కోలాహలం! ఇప్పుడో? ... వెధవముండ ... ఆ ముసిల్ది చీపురట్టుకొని, 'లేవండిబాబూ' - అంటూ బయలుదేరుతుంది దుమ్ము నాదికివూడుస్తూనే.

మన మైమనీసా చక్కగా వండి పెడుతూంది. నీవుచేసే సంరక్షణలన్నీ తానుచూస్తూంది ... కాని నా మనస్సు దేనికోరకో వెతుక్కుంటుంది. నిన్ననుఆన్నంవడ్డిస్తూ ... 'మా అమ్మగారు యింకా యెప్పుడు

వస్తారండి' అని అడిగింది. నీవులేవని దానికి బెంగగా వుందట—నాకు నవ్వువచ్చింది యీ నిర్జీవమైన కాలాన్ని నేనెట్లా గడుపుతున్నానని.

ఇంత విస్తీర్ణమైన పట్టణంలో యెన్నో అందాల ఆడవాళ్ళల్లో...యెన్నో ఫాషన్ల నవయువతుల్లో...తిరిగే నన్ను వదలి...యెక్కడో మూల... కొన్నిమైళ్ళ అవతల పల్లెలోవున్న నీకొరకు వెతుక్కుంటుంది నాహృదయం! పురాణాల్లో చెప్పే దేవకన్యలు, యిప్పుడిట్లు పల్లెల్లో అవతరిస్తున్నారనుకుంటాను—నూతనకవుల ప్రాణంతీయడానికి!

శుభాల్ని, అశుభాల్ని...కోపతాపాలు...అందించే ఆచేయి...యెంతో ఆనందాన్నిచ్చే నీ ప్రేమలేఖని అందిస్తుంటే చెప్పకోలేని బాధతో తల్లడిల్లిపోయింది నాహృదయం! పూర్వకాలంలో చిలుకలు హంసలూ ప్రియులకు రాయబారాలు జరిపేవట; లేఖల్ని అందించేవట...ఆశలు, ఈర్ష్యలేని ఆ చిన్ని హృదయాలు! ఇప్పుడట్లావుంటే రామరాజ్యంకంటె శాంతిపాలన చేసేవాడిని నా ప్రేమరాజ్యాన్ని!!... 'మీ చిఱునవ్వుల పెదవులపై నాముద్దులవర్షం..'ఎంత మృదువుగా...చక్కని సంభోధనాపదంతో మొదలెట్టావు! సంపాదించడం...తినడం...పెట్టుకున్న యీ భార్యాభర్తలు...వాళ్ళప్రేమ...—కాదు యంత్రాల్లాగు...కాని, నీలేఖ!...అందరి సువర్ణాక్షరాలనుండి రాలే మధురతమ వాక్యాలు, ప్రేమరసమొలికే పదాలు, ముద్దుమాటల్తో హృదయాన్ని గాయపరిచే ప్రణయసంభాషణలు...నాలో యేదో





మీరిదివరకెన్నడూ ఉపయోగించని
చక్కని సబ్బు
టాయ్‌లెట్, మెడిసినల్
వెప్
(మార్గోసా)
సబ్బు

కేరళా సోప్ ఇన్‌స్టిట్యూట్
కేలికట్

ఉద్రేకం పుష్పాంగి......మనోవనంలోని వసంత వృక్షాల్లో, పూలతో, ఊహా పంజెరాల్లోని చిలుకలతో చెప్పకున్నాను...కాని...యింకా వారం దినాలే యీ నిశీధ జీవితతరంగాల్ని తళ్ళడం!

దీన్ని కబన్ పార్కులో యెలక్ట్రిక్ దీపాల్తో, చిన్ని పైపుల్తో అందముగా అమర్చిన జలప్రాంతము ప్రక్కన—గచ్చుతిన్నెపై కూర్చోని వ్రాస్తున్నాను. ఎన్నో డిజైనులలో పడుతూన్న...నీటి జాలరులకు కలిగే చిన్ని కెరటాలు వచ్చి గచ్చుతిన్నెపై ఒకదానినొకటి ముద్దుపెట్టుకోడము చూసి...మన ప్రేమ రేయిళ్ల జ్ఞప్తికివచ్చి...దేని పొందికకోరకో వెతుక్కుంటూంది...ఆ దినము జ్ఞాపకమువుందా?—తుమ్మెద రావడము—పుష్పరాణులతో స్వేచ్ఛాక్రీడలు సల్పుతూంటే—దాన్ని నాకుచూపి నవ్వి...పార్కులో తిరిగే ఆ డాళ్ళని...నన్నూ...కలతనయనాలతో చూసి...నన్ను యింటికితీసుకొని వెళ్లావు! ఇప్పుడు ఆ దృశ్యాన్నైనా చూస్తే ఒక్కగంతులో వచ్చేదానినేమో !!

ఎదురింట్లో...రాత్రి...ఆ అద్దాలమధ్య, యెలక్ట్రిక్ దీపాలక్రింద...వాళ్ళని చూసేసరికి...నా వొళ్లంతా గగుర్పొడిచింది. అట్లాంటి సమయాన్న...మైమనీసా పాలు పట్టుకొనివస్తూంటే...ఆ వక్షస్థలములో వుబికి ఆడుతున్న చన్గవలలో...ఆ పెదాల్లో...లీనమైన ఆ యవ్వనము...నన్ను యేదో లోకములోకి తీసికెళ్లింది. ఆ నయనాల్లోని తీవ్రత నన్ను...అనుకున్నట్లే మందహాసవదనముతో మెట్లు దిగుతూంది. ఆ తన్మయత్వములో...'మైమా'—పిల్చాను...వర్ప్యమాత్రము వినిపించింది...

ఇంతవరకూ నీలో నేను దాచుకున్న ఆకర్షణ, ప్రేమ...అన్ని మేఘాల్లా విడిపోయినట్టే అయింది. నీవు త్వరగా రాకుంటే నేనెవరికో ?


విడుదలకు సిద్ధంగావున్నాయి

ఆచార్యా ఆర్ట్ ప్రొడక్షన్స్

కున్వారా బాప్

నటీనటులు :

కిశోర్ సాహూ, ప్రతిమాదాస్ గుప్త

దక్షిణ దేశం అంతకీ హక్కుదారులు

★

ముంతాజ్ శాంతి, ఉల్హాస్ నటించిన

లేడీ డాక్టర్

ఇతరులు

ముబారక్, నంద్రేకర్, డేవిడ్, కేశు

మైసూర్ స్టేట్, కూర్గ్, ఆంధ్ర దత్త మండలాలకు హక్కుదారులు

★

బామా ఫిలిమ్స్

వాల్మీకి

(తెలుగు)

మైసూర్ స్టేట్స్, కూర్గ్, దక్షిణ కెనరాలకు హక్కుదారులు

మిన్నల్ కొడి

(అరవం)

*Apply to:*

PRABHA PICTURES

Gandhinagar :: Bangalore City


 • USE ALWAYS "DEER" BRAND SOAPS.